కుక్కల జోరు.. ప్రజలు బేజారు!

- పిల్లలు, వృద్ధులపై దాడులు
- రాత్రి వేళల్లో భయాందోళనలో ప్రజలు
- పంచాయతీ వ్యర్థాలను చిందరవందర చేస్తున్న వైనం



వెంకట్రావుపేటలో కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన సాత్విక్ (ఫైల్)

పినపాక: 'గ్రామ సింహాలు' వీధుల్లో ఇప్పుడు నిజమైన సింహాల్లా రెచ్చిపోతున్నాయి. వీటి బెడద రోజురోజుకూ ఎక్కువైపోతుండటంతో గ్రామస్తులు ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ.. అపరిచితులు, సైకిళ్లపై, ద్విచక్ర వాహనదారులపై వెళ్లేవారిపై, చివరికి సొంత గ్రామస్తులపైనా దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా బడులకు వెళ్లే చిన్నారులు, వీధుల్లో ఆడుకునే పిల్లలు ఈ కుక్కల దాడులకు బలవుతున్నారు.

8 నెలల్లో 200 కేసులు..

మండలంలో వీధికుక్కలు స్వైర విహారం చేయడంతో కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. గడిచిన 8 నెలల్లో సుమారు 200 కుక్కకాటు కేసులు నమోదవడమే ఇందుకు తార్కాణం. వీటిల్లో మచ్చుకు కొన్ని సంఘటనలు పరిశీలిస్తే..

- వెంకట్రావుపేటలో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఆరు నెలల సాత్విక్ అనే బాలుడిని వీధి కుక్క కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి.
- జానంపేట గ్రామంలో స్కూలు నుంచి వస్తున్న చిన్నారి లాస్య వీధి కుక్కల దాడిలో తీవ్ర గాయపడింది. ఆమెను జానంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.
- బయ్యారం క్రాస్ రోడ్‌లో టీ స్టాల్ నిర్వహిస్తున్న మహిళ రాత్రి ఇంటికి వెళుతున్న క్రమంలో వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.
- కాకర్ల వెంకటరమణ అనే మహిళ ఇంటి దగ్గర పనులు చేస్తుండగా.. కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.
- బయ్యారం గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల హన్సిక ఇంటిదగ్గర ఆడుకుంటున్న క్రమంలో వీధికుక్కలు దాడి చేసి గాయపరిచాయి.
- నాగలక్ష్మి అనే మహిళ బయ్యారం గ్రామంలో రాత్రి వేల బస్సు ఎక్కుదామని వెళుతున్న క్రమంలో గాయపరిచారు.



వీధిలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

పరిశుభ్రతకు విఘాతం..

వీధి కుక్కలు కేవలం దాడులు చేయడమే కాకుండా, గ్రామాల్లో పరిశుభ్రతకు కూడా విఘాతం కలిగిస్తున్నాయి. గ్రామ పంచాయతీలు సేకరించిన చెత్తను కుక్కలు చిందరవందర చేయడం వల్ల పరిశుభ్రత లోపిస్తోంది. ఇది దోమలు, ఈగలు వృద్ధి చెందడానికి కారణమై, విషజ్వరాలు ప్రబలే ప్రమాదాన్ని పెంచుతోంది. అలాగే రాత్రి వేళల్లో అవిచేసే అరుపులు గ్రామస్తుల నిద్రకు భంగం కలిగిస్తున్నాయి. ప్రశాంతమైన జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి. కొన్నిసార్లు వీధి కుక్కలు పశువుల మందలపై, కోళ్లపై దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం..

ఈ సమస్యకు ప్రధాన కారణం స్థానిక పంచాయతీలు, పశుసంవర్ధక శాఖ అధికారుల నిర్లక్ష్యమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో కుక్కల సంతతిని నియంత్రించడానికి సరైన చర్యలు చేపట్టడం లేదు. రాబిస్ వ్యాధి నివారణపై రైతులకు, గ్రామస్తులకు సరైన అవగాహన కల్పించడం లేదు.



కుక్కల దాడిలో గాయపడిన లాస్య (ఫైల్)

కుక్క కరిచినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై సరైన సమాచారం అందుబాటులో లేదు. వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన నిధులు, వనరులను స్థానిక సంస్థలకు ప్రభుత్వం కేటాయించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఈ కష్టాలపై అధికారులు, పాలకులు తక్షణమే దృష్టి సారించాలి. కేవలం పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా, పల్లెల్లోనూ వీధి కుక్కల నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికలను అమలు చేయాలి.

పిల్లలు భయపడుతున్నారు..



చిన్నపిల్లలు ఆరు బయటకు వచ్చి ఆడుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితి. వీధి కుక్కలు గ్రామాల్లో అత్యధికం కావడంతో ఎప్పుడు ఎలా దాడి చేస్తాయో అని భయపడుతున్నాం.

– శివలక్ష్మి, బయ్యారం

కుక్కల నియంత్రణకు చర్యలు



వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్న మాట వాస్తవం. పైఅధికారుల సర్వేతో కుక్కల ఉత్పత్తిని నియంత్రిస్తున్నాం. తక్షణ చర్యలు చేపట్టి పూర్తిస్థాయిలో కుక్కలను నియంత్రిస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీఓ, పినపాక

- గ్రామాల్లో ప్రజలపై విరుచుకుపడుతున్న శునకాలు
- ఏటా పెరుగుతున్న బాధితులు
- దుమ్ముగూడెం వ్యాప్తంగా ఏడాదిలో 591 కేసులు

దుమ్ముగూడెం: వీధి కుక్కల స్వైరవిహారంతో మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కలు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. మండలంలో ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో ప్రజలు కుక్క కాటుకు గురై ఆస్పత్రులకు వెళ్తుండడం పరిస్థితిని అద్దం పడుతోంది. ఏజెన్సీలో వీధి కుక్కల సంఖ్యను అదుపు చేయడానికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల వాటి సంఖ్య ఏటేటా విపరీతంగా పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాధితులు ఎక్కువే..

మండలంలోని 37 పంచాయతీల పరిధిలోని 114 గ్రామాలలో విచ్చలవిడిగా కుక్కలు రోడ్లపై సంచరిస్తూ బాటసారులపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంటపడుతుండటంతో వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. 2024 ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు మూడు పీహెచ్‌సీల పరిధిలో 591 మంది కుక్క కాటుకు గురై రేబీస్ టీకాలు తీసుకున్నారు. వీరిలో దుమ్ముగూడెం పీహెచ్‌సీలో-323, నర్సాపురం పీహెచ్‌సీలో-192, పర్ణశాల పీహెచ్‌సీలో-76 మంది బాధితులు ఉన్నారు.

లక్ష్మీనగరంలో ఆందోళనకరం..

మండల ప్రధాన గ్రామమైన లక్ష్మీనగరం ప్రధాన రహదారిపై సుమారు 30కి పైగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి రహదారి పైనే ఉంటూ వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు వెంట వెంబడిస్తున్నాయి. రాత్రి సమయంలో అయితే ఇక చెప్పలేం. ఒంటరిగా లక్ష్మీనగరం రోడ్డుపై వెళ్లాలంటే



లక్ష్మీనగరం సెంటర్‌లో రహదారిపై కుక్కలు

కుక్కలు చుక్కలు చూపిస్తున్నాయి. ఒంటరి వ్యక్తి కనబడితే చుట్టుముట్టేస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

కుక్కల బెడద ఎక్కువైంది..



ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రిపూట నడుచుకుంటూ వెళ్లే వారితో పాటు బైక్‌పై వెళ్లే వారిని వెంటబడి కరుస్తున్నాయి. పిల్లలు, వద్దులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల బెడదను నివారించడానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– యలమంచి వంశీకృష్ణ, సీపీఎం నాయకుడు

పట్టింపులేని అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో కుక్కల సమస్య రోజురోజుకూ పెరిగిపోతుంది. కాలనీల్లో గుంపులు గుంపులుగా విచ్చలవిడిగా తిరుగుతూ.. ఒంటరిగా ఉండేడే వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఈ మధ్య కాలంలో కుక్కల సంచారం పలు కాలనీల్లో ఎక్కువైంది. కాలనీల వాసులు కుక్కల సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కుక్కల సమస్య నుంచి పట్టణ వాసులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



భద్రాచలం పట్టణంలోని ఓ కాలనీలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

అందుబాటులో టీకాలు



మండలంలోని మూడు పీహెచ్‌సీలలో రేబీస్ టీకాలను నిత్యం అందుబాటులో ఉంచుతున్నాం. మండలంలో కుక్క కాటు కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పెంపుడు కుక్కలకు పశువైద్యశాలలో టీకాలు వేయించుకోవాలి. కుక్క కరిచిన వెంటనే ఆ ప్రాంతాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి, పీహెచ్‌సీకి వచ్చి రేబీస్ టీకాలు వేయించుకోవాలి.

– రేపాక చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

మల్లెలమడుగులో విషజ్వరాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామానికి చెందిన పలువురు టైఫాయిడ్, మలేరియా, విషజ్వరాలతో బాధపడుతూ.. కొందరు ఆర్‌ఎంపీల వద్ద, ఇంకొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ తిరగక, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామంలో రోజుల తరబడి చెత్త పేరుకుపోతోంది. దుర్వాసనతోపాటు దోమలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అపరిశుభ్రతతో జ్వరాలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, చెత్తా చెదారం తొలగించి అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరపీడితులకు ఉచిత వైద్యం అందించాలని విన్నవిస్తున్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీ

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా.. వారి మాటున మావోయిస్టులు మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు, కుర్నపల్లి రోడ్‌లలో మోహరించిన పోలీసు బలగాలు.. వచ్చి పోయే ఆదివాసీలను నిలిపి వారిని నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు ఈ తనిఖీలను కొనసాగించారు.

సింగరేణి అధికారికి సన్మానం



పీఓ లక్ష్మీపతి గౌడ్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీలో సుదీర్ఘకాలం పని చేసి పదోన్నతిపై కొత్తగూడెం కార్పొరేట్ ఎస్టేట్ హెచ్‌ఓడీగా వెళ్తున్న పీఓ లక్ష్మీపతిగౌడ్‌కు ఆదివారం టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పీఓగా లక్ష్మీపతిగౌడ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, దిశెట్టి రమేష్, కటారి ప్రసాద్, నరేష్, ఇమ్రాన్, కోన వెంకటేష్, జి.రమేష్, డి.కృష్ణ, రమేష్‌బాబు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష పైగా వేలానికి గణేశ్ లడ్డూలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీలలో నెలకొల్పిన గణేష్ మండపాల్లోని గణపతి లడ్డుకు వేలంలో భారీ ధరలు పలికాయి. అశోక్‌నగర్ కాలనీలోని పవర్ బాయ్స్ మండలంలోని గణపతి అమృత ఫలాన్ని రూ.1.58.500 లక్షకు కాలనీకి చెందిన డాక్టర్ నాగరాజు దక్కించుకున్నారు. అలాగే భద్రాద్రి మహారాజ్ గణేష్ మండపంలోని మూడు లడ్డులకు వేలం నిర్వహించారు. మొదటి లడ్డును ముత్యాల రమేష్‌బాబు–శశికళ, పూజారి కృష్ణ–పుష్ప, మురళి–సుప్రియ దంపతులు రూ.1.50 లక్షకు, రెండో లడ్డును బీకే నాయుడు దంపతులు రూ.40 వేలకు, మూడో లడ్డును పిల్లి కల్యాణ్ రూ.33 వేలకు సొంతం చేసుకున్నారు.

రహదారులను అభివృద్ధి చేయాలి

మణుగూరురూరల్: మండల పరిధిలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలైన ఖమ్మంతోగు, బుగ్గ, బుడుగులలో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఇఫ్టూ నాయకులు ఎస్‌డీ.నాసర్‌పాషా ప్రభుత్వాన్ని ఆదివారం సోషల్ మీడియా వేదికగా కోరారు. ఆయా ఆదివాసీ గిరిజన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా ఏదైనా అత్యవసరమైన సందర్భాల్లో.. గర్భిణులను వైద్యం కోసం తరలించాలన్నా, అంబులెన్స్ గ్రామాలకు రావాలన్నా కష్టతరంగా మారిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌లు సమస్యపై స్పందించి గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని ఆయన కోరారు.

నియోజకవర్గానికి రూ.125 కోట్ల నిధులు



మణుగూరుటౌన్: సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గానికి వివిధ రకాల గ్రాంట్‌ల నుంచి రూ.125 కోట్ల నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ప్రజాభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన నిధుల వివరాలు వెల్లడించారు. ట్రైబల్ వెల్ఫేర్ గ్రాంట్ నుంచి 16 పనులకు రూ.30.19కోట్లు, సీఆర్ఆర్ గ్రాంట్ నుంచి 9 రోడ్లకుగాను రూ.15 కోట్లు, ఎంఆర్ఆర్ గ్రాంట్‌లో రూ.14.61 కోట్లు 11 పనులకు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో 14 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.1.68కోట్లు, ఎస్టీఎస్‌డీఎఫ్ గ్రాంట్ నుంచి ఐదు పనులకు రూ.9.17 కోట్లు, ఎస్‌డీఎఫ్ గ్రాంట్‌ల ద్వారా 29 పనులకు రూ.2.80 కోట్లు, డీఎంఎఫ్‌లో 54 పనులకు రూ.4.89కోట్లు విడుదలైనట్లు వెల్లడించారు. అదే విధంగా సారపాక గ్రామ పంచాయతీలో మూడు విడుతలుగా రూ.6.22 కోట్లు మంజూరవగా.. పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నిధులతో నియోజవర్గంలో మౌలిక సదుపాయాలు అందనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

ఆస్పత్రిని సందర్శన..


మండలంలోని 100 పడకల ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరా తీశారు. ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించిన ఆయన.. వైద్యులతో కలిసి అన్ని వార్డులు కలియదిరిగారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల వివరాలు తెలుసుకుని, ఏ గ్రామాల నుంచి జ్వరాల బారిన పడి వస్తున్నారని తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూపరింటెండెంట్ సునీల్‌కి సూచించారు. వైద్యుడు గౌరీ, సిబ్బంది, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ, సురేశ్, బాబు తదితరులున్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వరంగల్ శరత్ మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్యులచేత ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన జర్నలిస్టులు అందరూ అర్హులని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి కూడా ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల తాగునీటి శుద్ధి కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ సంఘం ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి దాసరి సాయన్న డిమాండ్ చేశారు. ఆదివారం పర్ణశాల వద్ద మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వక సమ్మెబాట పట్టిన మిషన్ భగీరథ కార్మికులకు.. మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించే వరకు సమ్మె విరమించొద్దని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నాగేష్, సందీప్, పవన్, నరేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: కార్మికులకు మద్దతు తెలుపుతున్న సాయన్న

పెండింగ్ వేతనాలు..

ములకలపల్లి: గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 12వ తేదీ నుంచి/జరుపతలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్టీ హాస్టల్ వార్డెన్ రాంబాబుకు సమ్మె నోటీస అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వర్కర్లను పర్మినెంట్ చేయాలని, 10 లక్షల ప్రమాదభీమా వర్తింపజేయాలని అన్నారు.

ఆలయాలు మూసివేత

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వెంకటేశ్వరస్వామి, మల్లిఖార్జునస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాలు తిరిగి తెరవనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులు దైవదర్శనాలు చేసుకోవచ్చన్నారు.

ఐటీడీఏ ఇంజనీరింగ్ ఈఈగా సత్యానందం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగములో ఈఈగా సీహెచ్ సత్యానందం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గత మే నెలలో ఈఈగా ఉన్న చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేయడంతో డీఈ హరీష్ ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నల్గొండ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో డీఈగా పనిచేస్తున్న సత్యానందంను పదోన్నతిపై భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నార్లపాటి సత్యవతి(63) కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబీకులతో మాట్లాడి వారికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంకత మల్లికార్జున్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జుజ్జురపు శ్రీరామ్మూర్తి, గ్రామస్తులు మహేష్, సుదర్శన్ ఉన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి

దమ్మపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీలో పలు అభివృద్ధి, మరమ్మతు పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి వినతిపత్రం అందజేశారు. ఆదివారం మండలంలోని గండగులపల్లి గ్రామంలోని మంత్రి తుమ్మల నివాసంలో, ఆయనను మార్కెట్ కమిటీ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి చేశారు. మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు.

యంత్రాల పనితీరు పరిశీలన



యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో యంత్రాల పనితీరును ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి పర్యవేక్షించారు. ఆదివారం ఫ్యాక్టరీని సందర్శించిన జీఎం, యంత్రాల పనితీరులో ఏమైనా లోపాలు ఉన్నాయా అని పరిశీలించి, సంబంధిత వివరాలను బాధ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఫ్యాక్టరీ సామర్థ్యానికి మించి అధికంగా వచ్చిన గెలలను ఎప్పటికప్పుడు క్రషింగ్ చేసి, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్, కార్తీక్, వెంకటేష్, రాజేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


ముసాయిదా జాబితాపై సమావేశం

బూర్గంపాడు: మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ఓటరు లిస్ట్ ముసాయిదా జాబితాపై మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జమలారెడ్డి తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశంలో తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలను ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4గంటల వరకు లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు.

మణుగూరురూరల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అభ్యంతరాలపై నేడు సోమవారం ఉదయం 11గంటలకు అఖిలపక్ష పార్టీ నాయకులతో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయితీలకు సంబంధించి ముసాయిదా ఓటర్ జాబితాలను, పోలింగ్ కేంద్రాల వివరాలను మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో, పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేటి సాయంత్రం 4గంటల లోపు లిఖితపూర్వకంగా తెలపాలని ఆయన సూచించారు.

అశ్వాపురం: మండలంలో ఒక జెడ్పీటీసీ, 12 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ఓటరు ముసాయిదా జాబితాలో మండలంలో 33,347 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పురుషులు 16,069, స్త్రీలు 17,278 మంది ఉన్నారు. మండలంలో 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


చంద్రుగొండలో భారీ వర్షం



వెంకటాపురంలో పత్తి పంటలో నిలిచిన నీరు

చంద్రుగొండ: మండలంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. పంటలు, లోతట్టు ప్రాంతాల్లో ఆవాసాలు జలమయమయ్యాయి. గంటపాటు కుండపోత వర్షం పడింది. అధికారిక లెక్కల ప్రకారం 8 సెంటీమీటర్లు వర్షం నమోదైంది. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 8, 500 ఎకరాల్లో పత్తి, మరో 4,500 ఎకరాల్లో వరి, 800 ఎకరాల్లో మిర్చి పంటలు సేద్యం చేశారు. ఇప్పటికి మండలంలోని చెరువులు నిండుకుండల్లా ఉండగా.. తాజాగా పడిన వర్షంతో అలుగులు పారాయి. వాగులు పొంగిపొర్లాయి. పత్తిలో నీటినిల్వలున్నాయి. దిగువ భాగంలో ఉన్న వరిపంట నీటిపాలైంది.

గణనాథుడి ఊరేగింపు



గణేశ్ ఊరేగింపులో కాళికా వేషధారణతో నృత్యాలు చేస్తున్న కళాకారులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని కూరగాయల మార్కెట్ ఆధ్వర్యంలో కొలువైన గణనాథుని ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ఊరేగింపు జరగ్గా.. కాళికా అలంకారాలతో, డప్పు చప్పుళ్ల మధ్య భక్తులు నృత్యాలు చేస్తూ అంబేడ్కర్ సెంటర్ నుంచి కొండాయిగూడెం నిమజ్జనానికి విగ్రహాలను తరలించారు. పట్టణ ప్రజలు శోభాయాత్రను ఆసక్తికరంగా తిలకించారు. ఈ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు.